# భిక్షువు

రచన :
శ్రీ రాజేంద్ర

తంబుర మీటుతూ భగవన్నామ సంకీర్తన గావిస్తూ వస్తున్నాడు ఒక భిక్షువు. ఎవరో బ్రతికి చెడ్డవాడుగా అవుపిస్తున్నాడు. వయస్సు ఏభై మీరి వుంటుంది, రుద్రాక్షలు ధరించాడు. విభూతి పట్టలు తీశాడు. అతడు ఒక యింటి ముందు నిలిచాడు. కుక్క బొంయ్ మని మీద కురికింది. 'నాన్సెన్స్...ఫూల్...నూసెన్సు కేసు పెట్టొచ్చు దీని మీద' అని కసురుకొంటూ వెనిక్కి తిరిగాడు. నా వూహ మరీ దృఢమైంది. నే కూర్చునివున్న గ్రంథాలయఆవరణకు వచ్చాడతడు. తంబుర క్రిందవుంచాడు. 'హరి....ఓం హరి...హరిగోవిందో' అనిముంత క్రిందవుంచాడు. ముంతలో వున్న గ్రుక్కెడు చద్దిని, అందులో ఉప్పా, అదీ వుందా, లేదా అనే జిజ్ఞాసగానీ, ఆ అనుమానంగానీ లేకండా, తప్పిస్తూ, తహ తహ లాడుతున్న స్వోదరానికిపోనిచ్చి నాలుక చప్పరించాడు. 'రాం రాం' అంటూ కూర్చున్నాడు.

నే మెల్లగా అతని వైపుకు జరిగాను. నా దగ్గరున్న పత్రికని లాక్కుని 'సిక్స్ మెన్స్ అరెస్టెడ్ అండర్ ది ప్రొహిబిషన్ ఆక్ట్' అని చదివాడు. ఇంగ్లీషు కూడా వస్తుందే. భిక్షువు కేమిటి ఇంగ్లీషు రావడమేమిటి? ఏదో వుండా లీతనిలో—బిక్షువు పేపరు ఇటునుంచి అటు వేపుకు త్రిప్పి చూసేసి నా చేతి కందిచ్చేశాడు.

అతని దృష్టి నాకర్షించడం కోసం, అతని వేపు పరీక్షార్థంగా చూశాను, అతని దృష్టి నా వేపు మళ్ళింది.

'ఆదిలో మీరూ....'

నిర్లిప్తంగా నవ్వేడతడు. నాకూ నవ్వాలనిపించింది. అయితే నవ్వలేదు.

'ఈ వృత్తికి మునుపు ఏంచేస్తుండే వారూ?' అన్నాను.

'అంతా చెబుతే వినగల ఓపిక వుందా' అన్నాడు వికసించిన ముఖంతో 'వినాలని చాల కుతూహలంగా వుంది, మిమ్మల్ని చూస్తూంటే ఆదిలో బాగా బ్రతికిన వ్యక్తి లాగానే వున్నారు' అన్నాను.

'అవును బాబూ ఆదిలో బాగా బ్రతికిన వాణ్ణే. గూడూరులో కానస్టేబుల్ గా వుండే వాణ్ణి, ఏం రోజులు...ఏం రోజులు...బలే రోజులవి మా స్టేషనుకు దగ్గర్లోనే ఒక మిలిటరీ హోటల్ వుండేది. పులవ్, పులవ్, మటన్, చాప్స్....' అంటూ నాలుక చప్పరించాడు. పెదవులు తడి చేసుకొన్నాడు. మ్చ్....మ్చ్ అన్నాడు.

'అవి కాంగ్రెస్ వాండ్ల సత్యాగ్రహంరోజులు బాబూ. రోజుకు ఎంతోమందిని అరెస్టుచేసే వాళ్ళం. అందరికీపై చేయినావే. చాలమందిని నిష్కారణంగా కూడా అరెస్టు చేశాను. ఎంతోమందిని నా లాటీ దెబ్బలకు గురి చేశాను. బాగా జ్ఞాపకం వుంది. ఆయన ఇప్పుడు, పార్లమెంటు మెంబరనుకోండీ, ఆయన మూడు రంగుల జెండా పట్టుకొని బజారున పడ్డాడు. ఆయన వెనుక మరో ఇరవై మంది. ఆయన్ని అనుసరించారు,

మామూలు ప్రకారం వాళ్ళను అరెస్టు చేయాలి. స్టేషనులో అప్పుడు మేం నలుగురం మాత్రమే వున్నాము. ఆ సత్యాగ్రహులూ నవోత్సాహంతో నవనవ లాడుతూ, ముందు కొస్తున్నారు. అడ్డులేని ప్రవాహం లాగా, గోదావరీ వరదలాగా. నా తప్ప మిగిలిన ముగ్గురికీ కాళ్ళు చేతులు, అదరుతోంది. ముగ్గుర్నీ లేవండన్నాను. భయపడుతూనే లేచారు.

'అరే ఎక్కడ్రా....ఈ రోజంతా అసలు వీధి వైపే వద్దురా, వరే భ్రూట్....వద్దురా' అన్నాడొకడు.

'ఐ వోన్ట్' అన్నాడొకడు.

'ఊపిరుంటే ఉప్పమ్ముకోవచ్చు....వాట్ ఈజ్ దిస్....ఐ కాన్ట్' అన్నాడు మరొకడు. లాటీలు రెండూ చేత బుచ్చుకొని నేనొక్కణ్ణే వీధిని పడ్డాను. ఇప్పుడే పోలీసు వీరాసామి పరాక్రమం చూపించాలనుకొన్నాను. అందులో అప్పుడు మిలిటరీ హోటలులో త్రాగి, మటన్ తిని మంచి కైపులో వున్నానేమో కూడా.

విస విసా ఠీవిగా నడిచి వెళ్ళి, ఆయన చేతిలోని ఫ్లాగ్ లాక్కున్నాను. అందరూ నాపై విరుచుక పడ్డారు. రెండు లాటీలతోనూ వారి బుజ్జలపై నగారా మ్రోగించాను. అరుస్తూ, కూతలు పెడుతూ ఇటొకరు, అటువేపొకరు పరుగు లంకించుకొన్నారు. ఇంతలో మా వాళ్ళు ముగ్గురూ వీధిలో వచ్చి పడ్డారప్పుడే వారికి సైగ చేశాను. దొరికిన వాడిని దొరికినట్లే అరెస్ట్ చేసి బేడీలు తగిలించి లాక్కుపోయారు. జండా మనిషి, నా చెంప వాచిపోయేలా ఒక్కటిచ్చాడు. ఏకఠీవిగా నా లాటీలో, ఆయన మోకాలు మీద వేశాను. నెత్తిన రెండు వేయాల్సి వచ్చింది. దెబ్బ తగిలి బ్లడ్ అట్లే ప్రవహించిందండి. అయినా నేను చలించలేదు.

నా ఉద్యోగ ధర్మం నేన్నిర్వర్తించాను. ఆయన్ని లాకప్ చేశాను. ఆయనకు ఇప్పటికీ వుంది నా దెబ్బ కనమ (మచ్చ) మొన్న కనపడ్డాడు. నమస్కారం బాబయ్యా అన్నాను. నేనెవరో చెప్పుకొన్నాను. నా ఈ అవస్థకు జాలిపడ్డాడు. పది రూపాయలిచ్చాడు. నే వద్దనలేదు. తీసుకొన్నాను. కనాన్ని చేత్తో తడివి చూసుకుంటూ కారెక్కి వెళ్ళిపోయాడు.

ఇలానే నే నెందర్నో అరెస్టు చేశాను. ఎందరినో నా లాటీ దెబ్బలకు గురి చేశాను. ఆ రోజుల్లో నేను పోలీసు జవాన్నే. ఈ ఘన కార్యాలతో నాకు ప్రమోషన్ వచ్చింది. ఇప్పటికీ నా దగ్గరే వున్నాయి. అప్పుడు నాకు గవర్నమెంటు యిచ్చిన ప్రశంసా పత్రాలు. డి. ఎస్. పి. గారు నాకొక రోజు విందు చేసి ఎంతో కీర్తించారు కూడా. ఆయన ఇంగ్లీషు వాడే.'

'ఆ రోజుల్లో నీవు రోజూ త్రాగేవాడివా' అన్నాను.

---

### గమనిక

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితం. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినదికాదు. రచయితల రచనలకు మేము ఏ మాత్రమూ బాధ్యులు కాము.

—సంపాదకుడు.

'మరేం బాబూ. రెండు ముంతల కల్లు త్రాగి–అరచేతి ముందు దోసెలు నాలుగూ, ఒక రెండణాల మటనూ తినేవాణ్ణి. ఆ రోజుల్లో అర్థణా యిస్తే, అలాంటి దోసె ఒకటి వచ్చేది. అయినా ఆ రోజులు వెళ్ళినయ్....! నేనలా వుండగనే, ఇండిపెండెన్సంటూ వచ్చి నన్ను ఇండిపెండెంట్ చేసింది.'

కాంగ్రెస్ ప్రభుత్వ మొస్తూనే మధ్యపానం నిషేధించింది. ప్రొహిబిషన్ ఆక్టు అంటూ ఒకటి పెట్టారు. ఇదే నా కొంప కూల్చింది. ఈ ఆక్టు వచ్చినా నేను త్రాగడం మానలేక పోయాను. నాకూ భార్యా బిడ్డలూ అందరూ వుండే వారు. నా జీతంతో నేను యిందర్నీ ఎలాంటి కష్టమూ పడకుండా పోషించగలిగే వాణ్ణి. సంసార కష్టాలేవీ నాకు అట్టే తెలియదు తినడం, త్రాగడం మాత్రమే నాకు తెలిసేవి.

ఒక రోజు–ఆ రోజును నే నెన్నడూ మరచి పోలేను. మరచి పోదామని ఎంత ప్రయత్నించినా మరచి పోలేకుండా వున్నాను. ఆ రోజు సాయంత్రం దొంగ సారా త్రాగి, కుర్చీలో కూర్చుని చిందర వందరగా నాకే తెలియని రాతేదో వ్రాసు కొంటున్నాను. నాతోటి వాడే....'బయ్యా' వికటాట్టహాసం చేస్తూ వచ్చి నా ముందు నిల్చున్నాడు.

'త్రాగావా' చాల ధైర్యంగా అన్నాడు.

'నీకేం' చుర చురా చూస్తూ అన్నా న్నేను.

'ఏం లేదు'

'మరేం?'

'ప్రొహిబిషన్ ఆక్టు విషయం నీకు తెలుసు గదూ'

'తెలుసు' అన్నాను దర్జాగా, ఠీవిగా....

'మరయితే....త్రాగిన వాడిని పట్టి ఎరెస్టు చేయాల్సిన నీవు ఎలా త్రాగావు?'

నా కెందుకో భయం వేసింది. వీడేదో ముప్పే తెచ్చే లాగున్నాడను కొన్నాను. అయినా ధైర్యం వహించాను.

**SONAL : : సోనాల్**

కత్తికోత, అడుసుపుండ్లు, కురుపులు, కాలడంవల్ల కలిగే పుండ్లు, కర్పాని, తీట, మొదలగు అన్నివిధములైన చర్మవ్యాధులను నివారించు గొప్ప ఔషధము.

*Mfg. By*:— **THE BHARATH DRUG HOUSE,**

**MADURAI.**

'నంబర్ త్రీనాట్ నైన్....నీకీవేళ డ్యూటీ ఏమి?' అన్నాను అధికార స్వరంలో అప్పుడు నే నే స్టేషన్ ఇంచార్జిని.

'త్రాగిన వాడిని ఎరెస్టు చేసి కస్టడీలోకి తీసుకోవడం నా డ్యూటి' వికటంగా నవ్వుతూ, నా ముఖంలోకి చూసి అని, తల వంచుకొన్నాడు. నేనూ తల దించుకొన్నాను.

ఏమిటి కర్తవ్యం....వీడేమో ఏదో చేసే లాగే వున్నాడు. వీడి నెలాగయినా మంచి చేసుకోవాలనుకొన్నాను. అంతేగాక చచ్చినా ఇక మళ్ళీ త్రాగరాదని నిశ్చయించుకొన్నాను 'త్రాగుడికి నేటితో సరి'అన్నాను మనసులోనే.

'వరే బయ్యా....నీకు ఖర్చులకి చిల్లర కావాలా' అన్నాను కంపిస్తూనే.

'నువ్వీ ఒక్క రోజు మాత్రమే ఇవ్వగలవు అంతేగా. నా ఈ ఒక్క చర్యలే నెక్స్టు మంత్ నుంచీ ప్రమోషన్ కూడా రాగలదు. జీవితాంతం వరకూ సుఖపడే దారి వుంది ఇక. తెలసిందీ.' అన్నాడు. వికటాట్టహాసం చేస్తూ.

రెండు నిముషాలు నా నోట మాట రాలేదు. సామధాన దండోపాయాలన్నీ ప్రయోగించాలనే వుద్దేశ్యంతో. 'ఏయ్'....అని గట్టిగా అరచి వాడి పీక పట్టుకొన్నాను.

'నౌ యు ఆర్ ఎరస్టెడ్' అన్నాడు అతి కష్టం మీద. వాడి చెంప చెళ్ళుమని పించాను.

'భలే' అంటూ విజిలు వేశాడు. ఎస్. ఐ. నుంచీ డి. ఎస్. పీ. వరకూ అంతా హాజరు!

'ఇంకా చెప్పాలా బాబూ. నన్ను డిస్మిస్ చేసేశారు. మూడు మాసాలు జైలు శిక్ష కూడా అనుభవించాను. నా భార్యా బిడ్డ లేమయ్యారో కానీ. ప్రస్తుతం నా జీవితమే నాకు తెలియడం లేదు' ముగించి నిట్టూర్పు విడిచాడు. పేపరుతో లోపలికెళ్తూ 'ప్చ్' అన్నాను.


రాయల్



తిరుపూరు రాయల్ బనియన్ నాణ్యమునకూ, మన్నికకూ గ్యారంటి.

అన్ని ఊళ్ళలోనూ అపరమితంగా విక్రయించబడుతున్నది. ఒకసారి వాడిచూచినట్లైతే మీకే తెలుస్తుంది.

వివరములకు:—

రాయల్ నెట్టింగ్ కంపెని-తిరుపూరు (S. I.)

ఆంధ్రదేశానికి ఏజంట్లు:

ఎస్. పార్థసారధి అయ్యంగార్.

(P.O.) సింగపెరుమాళ్ కోవిల్ : : (చెంగల్పట్టు జిల్లా.)